క్లుప్తంగా

ఉక్కు పరిశ్రమతోనే జిల్లా అభివృద్ధి

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లా అభివృద్ధి ఉక్కు పరిశ్రమతోనే సాధ్యమని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో జరగాల్సిన రాయలసీమ మహాసభలు వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం కృషిచేయాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ బాష, సుబ్బరాయుడు, ప్రసాద్, ఇమాంత్రన్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇష్టపడి కష్టపడడం ద్వారా విజయాలు సొంతమవుతాయని సీ–డ్యాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో డీడీయూజీకేవై పథకం ద్వారా వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ–డ్యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు, రైతులకు, మహిళలకు ఉపాధి కల్పించి పలు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ఎండీ ఇంతియాజ్ అహ్మద్, సెంటర్ పార్ట్‌నర్ ముజీబ్, రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, తేజ, గంగులయ్య, కల్యాణి, అలీ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించండి

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల(మను)లోని విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని మను కళాశాల సిబ్బంది జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్‌ను కోరారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన షేక్ ఇమ్రాన్‌ను వారు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. తమ కళాశాలలో హాస్టల్ వసతిని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు.

శుభ్రతతోనే దోమల నిర్మూలన



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమల నిర్మూలన సాధ్యపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని అలంఖాన్‌పల్లెలో పర్యటించారు. దోమల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి లోపల, బైట పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సూపర్‌వైజర్ మహబూబ్‌బాషి, ఏఎన్ఎం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ఇందిరానగర్ పద్మావతి వృద్ధాశ్రమంలోని అనాథలకు, వృద్ధులకు శుక్రవారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, అసోసియేట్ కార్యదర్శులు రాధాకృష్ణ, బాలయల్లారెడ్డి కోశాధికారి నగేష్, సంఘ బాధ్యు లు శంకరయ్య, సుభాన్, వృద్ధాశ్రమ నిర్వాహకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు బిషప్ అరుళయ్యపై పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : క్రైస్తవ ప్రముఖులు, ధార్మికవేత్త బిషప్ అరుళయ్యపై ఈనెల 30న ప్రత్యేకంగా పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆరోగ్యమాత చర్చి డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం ఆరోగ్యమాత చర్చి ఆవరణలో సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బిషప్ అరుళయ్య జీవితంపై మడగలం ప్రసాద్ పుస్తకాన్ని రూపొందించారని, దాన్ని అరుళయ్య 20వ వర్ధంతి సందర్భంగా బిషప్ రెవరెండ్ డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ బిషప్‌గా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చిలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ఘనంగా మొహర్రం

కడప కల్చరల్ : కడప నగరం ఏఎస్ఆర్ నగర్‌లోని పీర్ల మకాన్‌లో శుక్రవారం పవిత్ర మొహర్రం ఉత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మాసీమబాబు పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చావిడి నిర్వాహకులు మహబూబ్‌బాష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పైపులైన్ పగిలి తాగునీరంతా వృథా

కడప కార్పొరేషన్: ఈ ఫొటోలో రోడ్డుపై కనిపిస్తున్న నీరు వర్షపు నీటితో చేరింది కాదు. తాగునీటి పైపులైను పగలడంతో ఇలా తాగునీరు భారీ ప్రవాహంలా కనిపిస్తోంది.నగరంలో కొన్ని చోట్ల నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం భారీగా నీరు వృథా అవుతోంది. నగరంలో మాచుపల్లి రోడ్డులో ఉక్కాయపల్లె పాత కంపోస్టు యార్డు వద్ద కడప నగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు రంధ్రం పడింది. దీంతో పైపులైను నుంచి నీరు వృథాగా బయటకు వస్తోంది. రోడ్డుపై చెత్తాచెదారంతో కలిసిపోయి ఈ నీరు డ్రైనేజీ నీటిని తలపిస్తోంది. నగరపాలక అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయకపోతే తాగునీరు మరింత వృథా అయ్యే అవకాశం ఉంది.



మాచుపల్లి రోడ్డులో పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

వైవీయూ : కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ కడప చాప్టర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అతిథులు కళాశాలలో మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ డా. సలీంబాషా, స్విస్ట్ కళాశాల డైరెక్టర్ చంద్ర ఓబులరెడ్డి , రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా. గురు మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డా. జి. విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పురుషుల కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

ఆర్ట్స్ కళాశాలలో..

నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఎ.నాగరాజు, పి.శివరామకృష్ణ, డా. వై.సావిత్రి, పాల్గొన్నారు.

వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో..

డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో స్టెప్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైవీయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సహ ఆచార్యులు డా. శ్రీధర్‌రెడ్డి హాజరై పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, నారాయణ, వేణు, క్రీడాపాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ అన్నారు. శుక్రవారం నగరంలోని గుంతబజారులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలతతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫ్రైడేను డ్రైడేను పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లలితమ్మ, ఆశా వర్కర్ అరుణకుమార్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అంగన్వాడీ వర్కర్‌కు సూచనలిస్తున్న డాక్టర్ ప్రశాంత్ వర్ధన్

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా ఈనెల 29, 30 తేదీల్లో సెలవు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని శ్రీ హరి డిగ్రీ కళాశాల విద్యార్థులు మెగా గ్రాండ్ జాబ్ ఫైర్ ప్రోగ్రామ్‌లో ప్రతిభ చూపారు. ఈ ప్రోగ్రామ్‌కు హాజరైన పలువురు విద్యార్థులకు పలు కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు లభించాయి. శుక్రవారం మేయర్ సురేష్ బాబు వారికి ఉద్యోగ నియామకపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

కడప కోటిరెడ్డిసర్కిల్ : తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శి నారాయణదాస్ జ్యోతి రమణ శుక్రవారం కడప నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. బీజేపీ మహిళా మోర్చా ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్న జ్యోతి రమణ రెండు రోజుల పర్యటనలో భాగంగా కడపకు వచ్చారు.మద్రాసురోడ్డులోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు పరిశీలించి కేంద్ర పథకాల గురించి తెలియజేశారు. ఆ తర్వాత ఆమె ఆకులవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం, అన్నమయ్య సర్కిల్‌లోని కేంద్రం, దేవునికడప-1 అంగన్‌వాడీలను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారం గురించి తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బాలకృష్ణ యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శోభాభాయి, ప్రధాన కార్యదర్శి అంబికలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి సయ్యద్ సమీర, ప్రధాన కార్యదర్శి అంబిక, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌రావు, అన్నమాచార్య మండలాధ్యక్షురాలు లక్ష్మీనారాయణమ్మ, మహిళా నాయకురాళ్లు సుమ, ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో తెలంగాణ మహిళా మోర్చా కార్యదర్శి జ్యోతి రమణ

కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు(ఏబీవీపీ) శుక్రవారం కడప నగరంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని ఏబీవీపీ కడప విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 4వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో ఇంటర్ అడ్మిషన్లు చేసుకుంటున్న కళాశాలలను సీజ్ చేయాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ ప్రముఖ్ సాయి ప్రసాద్, నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు చరణ్, నరేష్, లక్ష్మీనారాయణ, శివశంకర్, సిద్దు, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి బంద్ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

వల్లూరు : అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని పైడికాలువ ఎస్సీ కాలనీ, జంగంపల్లె, సీతోరుపల్లెల్లో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఓవీ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, సర్పంచ్ చెన్నమ్మ, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవో పీఆర్‌డీ ప్రసాద్, ఏవో సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఏపీవో పార్థసారథి, పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

చక్రాయపేట : శ్రీ గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీవరకు జరిగే శ్రావణ మాసం ఉత్సవాలకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని శుక్రవారం టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని గండిక్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి కలిసి కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు టీటీడీ దేవస్థాన ఖర్చుతో షెడ్లు, స్టేజీ, మొబైల్ టాయిలెట్స్, 70 మంది పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. స్పందించిన టీటీడీ ఈఓ సంబంధిత అధికారులను పిలిపించి సత్వర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారని గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.



టీటీడీ ఈఓ ధర్మారెడ్డితో మాట్లాడుతున్న గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు తీర్చాలి

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలలుగా జరుగుతున్న పీఆర్సీ చర్చలు ముందుకు సాగడం లేదన్నారు. గతంలో ఎన్నడూ ఇంత ఆలస్యం జరగలేదన్నారు. పే రివిజన్‌ను వెంటనే అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను జీపీఎస్‌గా మార్చాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. గ్రేడ్–2 జేఎల్ఎంలను రెగ్యులర్ చేయాలని, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చేయాలన్నారు. చనిపోయిన గ్రేడ్–2 జేఎల్ఎంల కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలివ్వాలన్నారు.కార్యక్రమంలో జేఏసీ సెంట్రల్ కన్వీనర్ చాంద్‌బాషా, రామకృష్ణ, బర్నబాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగమునిస్వామి, యాకోబు, చలపతి, పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

31న అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 31వ తేదీన అరుణాచల గిరి ప్రదక్షిణకు తిరువన్నామలైకి వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి రెండు సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని, అవి రాత్రి 9.00, 9.30 గంటలకు బయలు దేరుతాయన్నారు. ఒక్కొక్కరికి టిక్కెట్ ధర రూ.1072గా నిర్ణయించామన్నారు.
- జమ్మలమడుగు నుంచి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. టిక్కెట్ ధర రూ. 1352గా నిర్ణయించారన్నారు.
- మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. ఒక్కొక్క టిక్కెట్ ధర రూ. 1432గా ఉంటుందన్నారు.
- బద్వేలు డిపోకు సంబంధించి పోరుమామిళ్లలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి బద్వేలు, కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా, మరో బస్సు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలంకు వెళుతుందన్నారు. అల్ట్రా డీలక్స్‌లో రూ.1566, సూపర్ లగ్జరీలో రూ. 1475 టిక్కెట్‌గా నిర్ణయించామన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి కంచి మీదుగా అరుణాచలం చేరుతుందన్నారు. ఈ బస్సులో టిక్కెట్ ధర రూ.1242గా ఉందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. టిక్కెట్ ధర రూ.1273గా నిర్ణయించారన్నారు.
- పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హోరాహోరీగా జోనల్ మ్యాచ్



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న నార్త్‌జోన్-సౌత్‌జోన్ జట్లు



వీరారెడ్డి (119 పరుగులు)

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ జోన్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం 192 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 72 ఓవర్లలో 238 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి.వి.సాయిశ్రవణ్ 51 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 3, సాయి ఆర్థిత్‌రెడ్డి 2, అక్షిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 84.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. జట్టులోని కె.హెచ్. వీరారెడ్డి 197 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో 119 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా ప్రణీల్‌రెడ్డి 55 పరుగులు చేయగా, భవానీప్రసాద్ 60 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ జట్టు 18 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

డీఈవో ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకూడదని డీఈఓ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో కడప జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో డీఈఓ స్పందించపోతే ఆగస్టు 6న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. శుక్రవారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకూడదని డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులను ఇప్పటి వరకు రద్దు చేయకపోవడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయటానికి డీఈఓకు ఉన్న విశేషాధికారాలేమిటో స్పష్టం చేయాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో, పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వీటిపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ సెక్రటరీ వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికొండయ్య, ఏపీటీఎఫ్ జిల్లానాయకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ్‌కుమార్

పంట పొలాల పరిశీలన

చెన్నూరు : మండలంలోని కొండపేట, చెన్నూరులలోని వరి, చీని, నిమ్మ పంటలను శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.రామలక్ష్మిదేవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానసలు పరిశీలించారు. వరిలో ప్రస్తుతం కొన్ని చోట్ల నాట్లు జరుగుతున్నాయని, మరి కొన్ని చోట్ల నాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. రైతులు వరి నాట్లు నాటేటప్పుడు ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ కాలిబాటలు తీసుకోవాలన్నారు. జింకు లోప లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ అలాగే 5 గ్రాముల యూరియా చొప్పున కలిపి 5 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. చీని నిమ్మలో సూక్ష్మ ధాతు లోపాలు ముఖ్యంగా జింకు, మెగ్నీషియం, ఇనుము ధాతు లోపాలు ఉన్నట్లైతే సూక్ష్మ పోషకాల మిశ్రమం 10 గ్రాములు ఒక లీటరుకు కలిపి పిచికారి చేయాలన్నారు. రసం పీల్చు పురుగులు ఆశించిన మొక్కలకు వేప నూనె 3 మి.లీ మరియు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఆర్.బి.కె. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తల్లి, శిశు సంరక్షణకు పాటుపడాలి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్య ఆరోగ్య సిబ్బంది తల్లి, శిశు సంరక్షణకు పాటుపడాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సుప్రిత తెలిపారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో శివయ్య ప్రోగ్రామ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులకు తల్లి, శిశు సంరక్షణ గురించి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఏఎన్ఎంలకు తల్లి బిడ్డ సంరక్షణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డను ప్రసవించే వరకు ప్రతి నెల రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. తల్లి ప్రసవించిన తర్వాత బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లి పాలే బిడ్డ తీసుకునే విధంగా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే శిశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. స్టాఫ్ నర్సులంతా తప్పని సరిగా ఏఎన్ఎంలను పర్యవేక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభం కానుందని, రోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

‘ఉక్కు’ ఆకాంక్ష నెరవేరేవరకు పోరు

కడప సెవెన్‌రోడ్స్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే వరకు పోరాటం సాగిస్తామని అఖిలపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో టీడీపీ నేత హరిప్రసాద్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ఆర్థికంగా, సాంకేతికంగా సాధ్యం కాదంటూ కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో అహంకార పూరిత ప్రకటన చేయడం విచారకరమన్నారు. కరువులు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్న లక్ష్యంతో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి బ్రహ్మణి స్టీల్స్‌కు శంకుస్థాపన చేశారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ అంశం చేర్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన బీజేపీ విభజన హామీలకు తిలోదకాలిచ్చిందని విమర్శించారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన భూమి, నీరు, రైల్వే, విమాన సౌకర్యాలు ఉన్నప్పటికీ ఇవేమి కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అలీఖాన్, బీఎస్పీ నేత గుర్రప్ప, ఆప్ నాయకుడు శ్రీనివాసులు, బీసీ మహాసభ నాయకుడు అవ్వారు మల్లికార్జున, ఆర్‌సీపీ నేత మగ్బూల్‌బాష, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నేతలు

దేశాభివృద్ధికి పరిశోధనలు కీలకం

వైవీయూ : భూవిజ్ఞానశాస్త్ర పరిశోధనలు దేశాభివృద్ధికి కీలకమైనవని, తద్వారా ఆర్థిక పరిపుష్టి, ఉద్యోగ భద్రత, వాతావరణ సమతుల్యత వంటి ముఖ్యమైన విభాగాలను సమన్వయించుకోవటం సాధ్యమని హైదరాబాద్ జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (సీఎస్ఐఆర్) భూగర్భశాస్త్రవేత్త డా. శ్రీనివాసశర్మ అన్నారు. శుక్రవారం వైవీయూ భూవిజ్ఞానశాఖ సహ ఆచార్యులు డా. ఎస్. శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో శాస్త్రీయ ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా వచ్చిన శ్రీనివాస శర్మ భూగర్భ బంగారు నిక్షేపాలపై కీలకోపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, భూగర్భశాస్త్రశాఖ విభాగాధిపతి తదితరులు పాల్గొన్నారు.